క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటుకు వచ్చే నెల 6 వరకు గడువు

కూసుమంచి: వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి కోరారు. బుధవారం కూసుమంచి, నాయకన్‌గూడెం తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 2019 ఓటరు జాబితా రద్దు కావడంతో నవంబర్ 6వ తేదీ లోగా మరలా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఓటు నమోదుపై ముద్రించిన కరపత్రాలను అందజేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఓ వివాహిత మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం..మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన ఓ వివాహిత (20) బుధవారం ఇంట్లో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మహిళా క్రికెటర్ల సాధనకు స్థలం కేటాయించాలి

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా నుంచి పలువురు మహిళా క్రికెటర్లు రాణిస్తున్నందున, వారి ప్రాక్టీస్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని పలువురు కోరారు. ఈసందర్భంగా మంగళవారం జిల్లాకు వచ్చిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డికి మహిళా క్రికెటర్లు వినతిపత్రం అందజేశారు. మహిళా క్రికెటర్ల కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయిస్తే మరింత మంది సత్తా చాటుతారని తెలిపారు. మహిళా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.డీ.మతిన్‌తో పాటు రాధిక, శైలజ, సుభద్ర, పద్మ, అంజలి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈగా ప్రభాకర్‌రావు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం సబ్ డివిజన్ మద్దులపల్లిలోని కోతులగుట్ట సబ్ స్టేషన్ ఏఈగా జె.ప్రభాకర్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా ఖమ్మం 5వ పట్టణం నుంచి ఇక్కడకు రాగా.. ఇక్కడ పని చేసిన ఏఈ క్రాంతిసింహ ఖమ్మం 1వ పట్టణానికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా పలువురు ఉద్యోగులు ప్రభాకర్‌రావుకు స్వాగతం, క్రాంతిసింహకు వీడ్కోలు పలికారు.

అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సయ్యద్‌భాషా

ఖమ్మం మామిళ్లగూడెం: దూదేకుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, స్వర్గీయ షేక్.ఫకీర్‌సాహెబ్ ఆరో వర్ధంతి సందర్భంగా ఖమ్మం మదర్ థెరిస్సా ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ భాషా ప్రారంభించి ఫకీర్‌సాహెబ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రహీం, ఉపాధ్యక్షులు షేక్ లాల్‌జాన్‌పాషా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానీబేగం, ఆర్గనైజింగ్ కార్యదర్శి లాల్ సాహెబ్, జిల్లా అధ్యక్షుడు రహీమ్‌పాషా, ప్రధాన కార్యదర్శి సిద్దుపాషా, మహిళా అధ్యక్షురాలు సకీనాబీ, నాయకులు సయ్యద్ హుస్సైన్, కార్పొరేటర్ సైదులు, హుస్సైన్, మదార్‌సాహెబ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం శరత్‌మాక్స్ విజన్ కంటి ఆస్పత్రి సహకారంతో జిల్లా సీనియర్ సిటిజెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఖమ్మం చర్చి కాంపౌండ్‌లోని గాంధీ పార్కులో గల సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా సీనియర్ సిటిజెన్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ ప్రారంభించారు. మొత్తం 112 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల అద్దాలు మార్చడం, ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాదినేని జనార్దన్‌రావు, జి.సూర్య ప్రకాశరావు, కొత్త సత్యనారాయణరెడ్డి, గోవర్దన్‌రావు, ఉపేందర్‌రెడ్డి, ములగుండ్ల శ్రీహరి, నరసయ్య, గజేంద్రుల నాగేశ్వరావు, జిల్లా వెంకటేశ్వర్లు, తాత రాఘవయ్య, రచ్చ రామారావు, వేగినాటి లక్ష్మయ్య, నికుంశింగ్, కౌన్సిలర్ శ్రీకాంత్, సి.సింధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు

తిరుమలాయపాలెం: రైతు సమన్వయ సమితి మాజీ మండల కన్వీనర్, కాంగ్రెస్ నాయకుడు చావా శివరామకృష్ణ జన్మదిన వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా తిరుమలాయపాలెం, కొక్కిరేణి, ఎర్రగడ్డల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

పైరవీలు..గగ్గోలు!



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

జవాన్ల పనితీరుపై అసహనం

- పని చేయని వారిని మార్చాలని వినతులు
- పర్యవేక్షణ లేక కుంటుపడుతున్న పారిశుద్ధ్యం
- అధికారులకు తలనొప్పిగా మారిన కార్మిక సంఘం నేత తీరు
- పక్కనబెట్టిన వర్కర్లకు వత్తాసు

ఖమ్మంమయూరిసెంటర్: డివిజన్లలో జవాన్ల పనితీరుపై కార్పొరేటర్లు, స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. జవాన్లు సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో వర్కర్లు పనిచేయక పారిశుద్ధ్యం కుంటుపడుతుందని కేఎంసీ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఇలాంటి జవాన్లు తమ డివిజన్‌లో ఉంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమ ముఖం కూడా చూడరని, వెంటనే తమ డివిజన్ నుంచి మార్చాలని కోరుతూ ఓ కార్పొరేటర్ వారం రోజుల క్రితం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లను కలిసి విన్నవించారు. వారం రోజులుగా పలువురు కార్పొరేటర్లు కేఎంసీ కార్యాలయానికి అభివృద్ధి పనుల నిమిత్తం కాకుండా జవాన్లను మార్చాలనే ప్రతిపాదనలతో వస్తుండడం గమనార్హం.

అంతా వారిష్టమే..

క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించడం, పనులు పర్యవేక్షించడం, వారికి హాజరు వేయడం, అధికారులు చెప్పిన డివిజన్‌కు సంబంధించిన పనులను సకాలంలో పూర్తి చేయించడంలో జవాన్లది కీలక బాధ్యత. కొంతమంది జవాన్లు తమకున్న పలుకుబడిని ఉపయోగించుకుంటూ కార్పొరేటర్ మాట కాని, ఉన్నతాధికారుల ఆదేశాలు కానీ పట్టించుకోకుండా తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కనీసం కార్మికుల హాజరు తీసుకోవడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని పలుమార్లు అధికారుల దృష్టికి వచ్చింది. పదిమంది వరకు జవాన్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారనే ఫిర్యాదులు అధికారులకు అందాయి.

కార్పొరేటర్ల గగ్గోలు..

డివిజన్లలో పారిశుద్ధ్య పనులు చేయించాల్సిన జవాన్లు తమ కళ్లకు కనిపించకుండా తిరుగుతున్నారని కొంతమంది కార్పొరేటర్లు వాపోతున్నారు. పైరవీలు చేసుకుంటూ, కొంత మంది కార్మికుల వద్ద కమీషన్లు తీసుకుని పని చేయకున్నా పట్టించుకోవడం లేదని అధికారుల వద్ద వాపోయారు. తక్షణమే తమ డివిజన్ల నుంచి వీరిని తొలగించి పనిచేసే జవాన్లను తమకు కేటాయించాలంటూ మేయర్, అధికారుల ఎదుట తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు.

కార్మిక సంఘం నేత జోక్యం..

జవాన్లు, వర్కర్లు సక్రమంగా పనిచేయడం లేదని అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్న తరుణంలో ఓ కార్మిక సంఘ నేత తీరు కేఎంసీ అధికారులకు తలనొప్పిగా మారింది. కార్పొరేటర్లు, స్థానికుల ఫిర్యాదుతో పక్కన పెట్టిన వర్కర్ల తరఫున వకాల్తా పుచ్చుకుని అధికారుల వద్దకు వచ్చి తిరిగి పనుల్లో పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసి.. వాటిలో కొంత భాగం అధికారులకు కూడా ముట్టజెబుతున్నారన్న విమర్శలున్నాయి. ఇటీవల ఓ వివాదంలో కార్మికుడిని అధికారులు పక్కన పెట్టగా.. భారీ పైరవీతో అతడిని మళ్లీ విధుల్లోకి తీసుకునేలా చర్చలు జరిపినట్లు కేఎంసీలో చర్చ జరుగుతోంది. ఇక 10వ డివిజన్‌లో ఓ కార్మికుడి వద్ద డబ్బులు తీసుకుని అతని స్థానంలో మరో వ్యక్తిని నియమించారని, అలాగే తన స్థానంలో తాను చూపించిన వ్యక్తిని పెట్టేలా చూడాలని 11వ డివిజన్ కార్మికుడు అడిగినట్లు తెలిసింది. డబ్బులు తీసుకుని కార్మికులను మారుస్తున్నారని, తాము డబ్బులు ఇస్తామంటున్నా ఎందుకు మార్చడం లేదని సదరు కార్మికుడు ప్రశ్నించడం కొసమెరుపు. ప్రస్తుతం జరుగుతున్న జవాన్ల డివిజన్ల మార్పులో ఆ నేతను జోక్యం చేసుకోవద్దంటూ ఓ కార్పొరేటర్ అధికారి ఎదుటే సూచించడం కూడా ఆ నేత ఏ స్థాయిలో పైరవీలు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

జవాన్ల మార్పును పరిశీలిస్తున్నాం..



కొంతమంది కార్పొరేటర్లు జవాన్లు సక్రమంగా పనిచేయడం లేదని మా దృష్టికి తీసుకొచ్చారు. ఆ జవాన్లను అక్కడి నుంచి మార్చి వేరే డివిజన్లకు కేటాయిస్తున్నాం. పనిచేయని జవాన్లపై చర్యలు తీసుకుంటాం. వర్కర్లు, జవాన్ల మార్పులు, చేర్పుల్లో కార్మిక సంఘాల నేతల జోక్యాన్ని దూరంగా ఉంచుతాం. వర్కర్ల గ్రూపు తీర్మానాలను బట్టే వ్యక్తులను మార్చబడుతుంది.

– పునుకొల్లు నీరజ, మేయర్

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

కామేపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొమ్మినేపల్లి చాకలిమాన్యంతండా ప్రాథమిక పాఠశాలను, కొమ్మినేపల్లి అంగన్‌వాడీ కేంద్రం–2ను సందర్శించి విద్యార్థులు, చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించి కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ, విద్యా బోధన వంటి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



కొమ్మినేపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాంగోపాల్‌రెడ్డి

కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎ.సంపత్‌కుమార్‌ను మధిర మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, మధిర మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న అహ్మద్ సఫీఉల్లాహ్‌ను కేఎంసీ ఏఎంసీగా నియమిస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కింద వీరిని బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇటీవల వచ్చిన వరదల సమయాన చురుకుగా పని చేయడంతో పాటు పారిశుద్ధ్యం మెరుగుపరచడంలో విశేషంగా పని చేసిన సంపత్ కుమార్‌ను బదిలీ వెనుక ఏదైనా బలమైన కారణం ఉందా? అసలు పంపించాల్సిన అవసరం ఏముందని కేఎంసీ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంరూరల్: జిల్లాలోని ముగ్గురు మంత్రులవి ప్రచారం ఆర్భాటాలే తప్ప అభివృద్ధి పనులకు శంకుస్థాపనలపై ఉన్న దృష్టి వరద బాధితులను ఆదుకోవడంలో లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకుడు ఆర్‌జేసీ కృష్ణ, సీపీఐ జిల్లా నాయకుడు నూనె శశిధర్ ఆరోపించారు. మున్నేరు వరద బాధితులు అనేక మందికి ఆర్థిక సాయం అందలేదని, ఇళ్లు కోల్పోయిన వారికి సాయం చేయడం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్ ఆధ్వర్యాన వరద బాధితులతో కలిసి ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వరదలు వచ్చి నెలన్నర అయినా వందలాది కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందక కార్పొరేషన్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. ఇకనైనా వారి బాధలను అర్థ చేసుకుని మిగిలిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ధర్నా సభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై విక్రం, కార్పొరేటర్లు రుద్రగాని శ్రీదేవి, వెల్లంపల్లి వెంకట్రావు, నాయకులు శ్రీనివాసరావు, ప్రసాద్, తిరుపతిరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండల తహసీల్ ఎదుట సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీపీ సంపత్‌కుమార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, నాయకులు పి. మోహన్‌రావు, వి. సుదర్శన్‌రెడ్డి, వి. నాగేశ్వరరావు, ఎ.ప్రసాద్, ఎ.శ్రీనివాసరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం అర్బన్ తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్షం నాయకులు

వరద బాధితులకు స్కోప్ ఆర్డీ చేయూత



విద్యా ఉపకరణాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంలోని మున్నేరు ప్రభావిత ప్రాంతాలైన రాజీవ్ గృహకల్ప, వెంకటేశ్వరనగర్ కాలనీల్లో విద్యార్థులకు బుధవారం స్కోప్ సంస్థ తరఫున ఉపకరణాలు అందజేశారు. స్థానిక కార్యాలయంలో 25మంది విద్యార్థులకు సంస్థ డైరెక్టర్ ఎంఎల్.ప్రసాద్ రూ.25వేల విలువైన బ్యాగ్, వాటర్ బాటిల్, పెన్నులు, నోట్ బుక్స్, పెన్సిళ్లు, పండ్ల రసాల కిట్లు అందజేసి మాట్లాడారు.కోఆర్డినేటర్ కె సుజాత, ప్రతినిధులు భవాని, నక్షత్ర తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసరాల పంపిణీ..

తిరుమలాయపాలెం: అకాల వర్షాలు, వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా గ్రామస్తులకు బడావో బంజార ఫౌజర్ ట్రస్ట్ ఆధ్వర్యాన బుధవారం 50 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ స్థాపకుడు భూక్యా లాజరస్ లాల్‌సింగ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ ప్రేమ్‌సాగర్‌సింగ్, మేనేజర్ సోలోమెన్ సభ్యులు మల్సూర్‌నాయక్, రామాచారి, బాలరాజు, సందీప్, సుధాకర్, తదతరులు పాల్గొన్నారు.

‘ఎస్‌బీఐటీ’లో ఓరియంటేషన్ ప్రోగ్రాం

ఖమ్మం సహకారనగర్: ఎస్‌బీఐటీ అటానమస్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ ఓరియంటేషన్ ప్రోగ్రాంను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రణాళికబద్ధమైన, నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు జి.ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, జె.రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘న్యూ ఇరా’ విద్యార్థి ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఓపెన్ నేషనల్ చాంపియన్‌షిప్ ఇండియా స్కేట్–2024 పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి వివాన్ శ్రేయస్ ప్రతిభ కనబర్చారని న్యూఇరా పాఠశాల డైరెక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. రాష్ట్ర రోలర్ స్కేటింగ్‌లో సత్తా చాటి జాతీయ స్థాయిలో ఆర్‌ఎస్‌ఎఫ్‌ఐ అసోసియేషన్ నిర్వహించే రోలర్ స్కేటింగ్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా తిరుమలాయపాలెం



వ్యాయామ ఉపాధ్యాయులను అభినందిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ గేమ్స్‌లో భాగంగా ఇటీవల కూసుమంచి, ముదిగొండ జోన్‌లో నిర్వహించిన జోనల్ క్రీడోత్సవాల్లో తిరుమలాయపాలెం మండలం ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. తిరుమలాయపాలెం జట్టు అండర్–17 సీనియర్ బాలుర కబడ్డీలో మొదటి బహుమతి, సీనియర్ బాలుర ఖోఖోలో ద్వితీయ బహుమతి సాధించింది. అలాగే సీనియర్, జూనియర్ బాలికల విభాగాల్లో వాలీబాల్ పోటీలో విజేతగా నిలిచింది. అండర్–14 జూనియర్ బాలుర విభాగంలో ఖోఖోలో సైతం విజేతగా నిలిచి ఓవరాల్ చాంపియన్‌గా, జోనల్ నుంచి జిల్లాస్థాయి ఖోఖోలో రన్నరప్‌గా నిలిచి అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ క్రీడోత్సవాల్లో తిరుమలాయపాలెం మండల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులుగంగా ప్రసాద్, సైదులు, పాపారావు, సుజాత, కవిత, రాజేశ్వరి, అలివేలు, చంద్రకళను మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, మండల క్రీడోత్సవాల కన్వీనర్ విజయకుమారి, స్పెషల్ ఆఫీసర్ సీతారామరెడ్డి, పెసర ప్రభాకర్‌రెడ్డిలు అభినందించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: అభివృద్ధి పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60వ డివిజన్ రామన్నపేట ఎస్సీ కాలనీలో ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా రెండు లైన్ల కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని, భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఉండొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, 60వ డివిజన్ కార్పొరేటర్ బద్దె నిరంజన్ కుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

కొనుగోలు కేంద్రాలపై ప్రచారం చేయండి

- అదనపు కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి: కొనుగోలు కేంద్రాలపై విస్తృత ప్రచారం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ సూచించారు. మండలంలోని చెరువుమాధారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుని కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. వంట గదులు, తరగతి గదులను పరిశీలించి మధ్యాహ్న భోజనంలో మెనూ పాటిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకుని మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం నేలకొండపల్లిలోని రామదాసు ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, ఈజీఎస్ ఏపీఓ సునీత తదితరులు పాల్గొన్నారు.



రామదాసు మందిరం వద్ద అదనపు కలెక్టర్ శ్రీజ

నగరంలో మేయర్ విస్తృత పర్యటన

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖమ్మంఅర్బన్: రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో వారికి అందుబాటులో ఉండేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని అల్లీపురంలో వీవీపాలెం సహకార సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. వీవీపాలెం సొసైటీ పరిధిలో అల్లీపురం, వేపకుంట్ల, చింతగుర్తి ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు, సీఈఓ ఐతగాని తిరుపతిరావు, మేప్మా పీడీ మహేందర్, రైతులు, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మేయర్..

నగరంలోని రుద్రమకోట వద్ద శ్రీచైతన్య గ్లోబల్ విస్తా పాఠశాలలో వన మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్‌లు మాట్లాడగా.. కార్యక్రమంలో కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు, పాఠశాలల డీజీఎం చేతన్ మాధుర్, ప్రిన్సిపాళ్లు జయసుధ, టీఎస్‌ఎన్.శర్మ, కోఆర్డినేటర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అల్లీపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నీరజ, తదితరులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 49వ, 45వ డివిజన్లలో అభివృద్ధి పనులకు బుధవారం మేయర్ పునుకొల్లు నీరజ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి మంజూరైన నిధులతో మామిళ్లగూడెం నుంచి బైపాస్ రోడ్డు ఆంజనేయస్వామి దేవాలయం వరకు బీటీ రోడ్డును నిర్మిస్తున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, బుడిగం శ్రీనివాస్, నాయకులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్షా సమావేశం

కూసుమంచి: వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఏర్పాటు చేయనున్న కొనుగోలు కేంద్రాలు, వాటి నిర్వహణపై చర్చించారు. మండలంలో మొత్తం 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా.. వీటిలో ఐకేపీ ఆధ్వర్యాన 5, పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన 4, డీసీఎంఎస్ ఆధ్వర్యాన 3 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఇదివరకు 8 కేంద్రాలు ఉండగా.. కొత్తగా మరో 4 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ఏఓ వాణి, ఎంపీఓ రాంచందర్‌రావు, ఐకేపీ ఏపీఎం సత్యవర్ధన్ రాజు, సహకార సంఘాల సీఈఓలు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

కూసుమంచి: డీఎస్సీ–2024 ద్వారా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ అనంతరం బుధవారం విధుల్లో చేరారు. వారికి మండల విద్యాశాఖ అధికారి పోస్టింగ్ పత్రాలను అందజేయగా.. మండలానికి ఎంపికైన 24 మంది ఉపాధ్యాయుల్లో తొలిరోజు 19 మంది విధుల్లో చేరారు. ఈమేరకు కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా ఉపాధ్యాయులు కలుసుకోగా.. వారిని అభినందించి విద్యార్థుల భవిష్యత్‌ను అన్ని విధాలుగా తీర్చిదిద్దాలన్నారు. నూతన ఉపాధ్యాయులకు ఎంఈఓతో పాటు టీపీటీఎఫ్, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ మండల బాధ్యులు జె.భద్రూ, యాకయ్య, ఆంజనేయులు, నర్సయ్య తదితరులు అభినందనలు తెలిపారు.



ఖమ్మం సహకారనగర్ : ఖమ్మం అర్బన్ ఎంఈఓ రాములుకు రిపోర్టు చేస్తున్న ఉపాధ్యాయురాలు

దంతాల పరిశుభ్రతతో ఆరోగ్య రక్షణ

ఖమ్మంఅర్బన్: దంతాల పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండొచ్చని మమత డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ ఎండోడెంటిక్స్ దినోత్సవం సందర్భంగా మమత దంత వైద్య కళాశాల, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడెంటిక్స్ ఆధ్వర్యాన బుధవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం పంటి సంబంధిత సమస్యలు, చికిత్సపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ అనితరావు, ప్రొఫెసర్లు చంద్రశేఖరరావు, శ్రీదేవి, మురళి, ప్రదీప్, పుష్పవతి, పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లింక్, డొంక రోడ్ల స్థానంలో బీటీ రోడ్లు

12 రోడ్లకు రూ.25కోట్ల నిధుల మంజూరు

రఘునాథపాలెం: ఖమ్మం నియోజకవర్గంలో గ్రామీణ మండలమైన రఘునాథపాలెంలోని పలు గ్రామాలకు లింక్, డొంక రోడ్లకు మహర్దశ పట్టనుంది. నియోజకవర్గానికి తాజాగా రూ.25 కోట్లు కేటాయించడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రతిపాదనల మేరకు 12 బీటీ రోడ్ల నిర్మాణానికి వెచ్చించనున్నారు. కోయచలక నుంచికామంచికల్ వరకు బీటీ రోడ్డుకు రూ.5 కోట్లు, అల్లీపురం రోడ్డు నుంచి కంకరమిల్లు మీదుగా రామకృష్ణపురం వరకు రూ.3.95 కోట్లు, కోటపాడు నుంచి దారేడు వరకు రూ.2.95 కోట్లు, బూడిదంపాడు పుఠానితండా నుంచి వాంకుడోత్ తండా వరకు రూ.2.80 కోట్లు, వి.వెంకటాయపాలెం ఎన్నెస్పీ కాల్వ నుంచి ఇల్లెందు – వైరా రోడ్డుకు వెళ్లే రఘునాథపాలెం బైపాస్ వరకు రూ.2.50 కోట్లు, దొనబండ నుంచి గణేశ్వరం వరకు రూ.2కోట్లు, జింకలతండా రోడ్డు నుంచి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇక కోయచలక క్రాస్ రోడ్డు నుంచి దారేడు వరకు, అల్లీపురం రోడ్డు నుంచి జంగాల కాలనీ వరకు, రఘునాథపాలెం రైస్ మిల్లు నుంచి ఇల్లెందు రోడ్డు వరకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటి చొప్పున, దొనబండ – లచ్చిరాంతండా మధ్య బ్రిడ్జి నిర్మాణం, రాములుతండా నుంచి బానోజీతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షల చొప్పున మంజూరయ్యాయి.